

# నిజాయితీ

బెహరా వెంకట సుబ్బారావు

ఉదయం నిద్రమంచం దిగిన దగ్గర నుంచీ పదిగంటలవరకూ ఊపిరి తీసుకొనేందుకూడా ఖాళీ వుండదు జానకికి. అయిదు గంటలకి అందరికన్నా ముందు లేస్తుంది. కాలకృత్యాలు తీర్చుకొని వేడినీళ్ళకోసం బాయిలర్ అంటిస్తుంది. వెంటనే తాను చన్నీటిస్నానం చేస్తుంది. స్నానం అయిన తర్వాత కాఫీ తయారుచేసి భర్తకీ పిల్లలకీ రెడీగా వుంచుతుంది. భర్తా పిల్లలూ లేచేసరికి ఆరున్నర దాటుతుంది. మొహాలు కడుక్కోగానే కాఫీ అంటారు. అందుకే రెడీగా వుంచుతుంది. ఆరున్నరా ఏడు గంటలమధ్య పూజా కార్యక్రమంలో వుంటుంది జానకి. ఆ కార్యక్రమం ముగిసేసరికి, ఏడు దాటాక పనిమనిషి వస్తుంది. దగ్గరుండి దానిచేత పాచిపనులు చేయించి తర్వాత గిన్నెలు తోమిస్తుంది. తర్వాత నీళ్ళు తోడిస్తుంది. ఏపాటి ఏమరపాటుగా వున్నా ఏదో పనిని

అసంపూర్తిగా వదిలేస్తుంది పనిమనిషి. అందుకే స్వయంగా చూసుకొంటుంది. కాఫీలూ, స్నానాలూ అయాక మగపిల్లలిద్దరూ ట్యూషన్‌కి బయలుదేర్తారు. పెద్ద కూతురుకి, చిన్నకూతురికి జడవేసి స్కూలుకి పంపుతుంది. జడవేసేటప్పుడు అక్కాచెల్లెళ్ళమధ్య తగవులూ, పేచీలు వస్తాయ్. ఒక్కొక్కప్పుడు దెబ్బలాడుకుంటారు కూడా. తొమ్మిది గంటలకల్లా భర్త భోజనానికి తయారవుతాడు. వంట పనిలో సతమతమౌతూన్న జానకి ఆ సమయంలో ఒక్కొక్కప్పుడు సహనాన్ని కోల్పోతుంది.

ఆ రోజు వుదయం తొమ్మిదిన్నర గంటలకి జానకి భర్త రఘురామం బెజవాడ ప్రయాణం పెట్టుకున్నాడు. వారం రోజుల క్రితం బెజవాడవారు పెద్దమ్మాయిని చూసుకొని వెళ్ళారు. పిల్ల నచ్చింది మాట్లాడుకొందుకు రమ్మని లెటరు రావడంతో విజయవాడ ప్రయాణం పెట్టుకొన్నాడు. తొమ్మిదింపావుకల్లా రఘురామం యిల్లు వదలాలి తర్వాత వర్జ్యం వస్తుంది. అందుకే ఆ పూట చాలా బిజీగా వుంది జానకి. గాస్‌స్టవ్‌మీద కూర వుడుకుతోంది. కూరని చూస్తూండమని పెద్దమ్మాయికి పురమాయించి గదిలోకి వెళ్ళింది జానకి. భర్తకి సూచనలూ సలహాలు యిస్తోంది. పెళ్ళివారితో ఎలామాట్లాడాలో చెబుతోంది. టైము తొమ్మిది కావస్తోంది. చాలా బిజీగా వుంది జానకి.

"అమ్మా! చాకలి బట్టలు తెచ్చాడు!" చిన్నమ్మాయి తెచ్చిన వార్తకి విసుక్కొంది జానకి.

"వీడి కెన్నిసార్లు చెప్పినా యిలాంటప్పుడే వస్తాడు. వుదయమే రావద్దని లక్షసార్లు చెప్పాను. నిన్ననే జీతాలు అందాయి కదూ! డబ్బు పట్టుకుపోడానికి వచ్చి వుంటాడు!"

రెండు రోజుల్లో తెస్తానని వారం రోజుల క్రితం చెప్పిన చాకలి రావులుమీద అమితమైన ఆగ్రహం వచ్చింది జానకికి. గబగబా ముందు వరండాలోకి వెళ్ళింది.

"ఏరా! ఇప్పుడా తేవడం? అయ్యగారు కేంపెకెళ్ళడానికి బట్టలు లేక నిన్న ఒక జత వుతికాను. నీకు డబ్బు అవసరం వచ్చింది, బట్టలు తెచ్చేవు!" కస్సుమంది.

"లేదమ్మగోరూ! ఆడదానికి నాలుగు రోజులబట్టీ జొరం! రేవు కెళ్ళలేదు!" నసిగాడు రావులు.

"ఎప్పుడూ ఏదో ఒక సాకు చెబుతూ వుంటావ్ మాట నిలకడుండాలి! మనిషిలో నిజాయితీ వుండాలిరా! బోలెడు డబ్బు తీసుకొంటున్నావ్! మాకు బట్టలుతుక్కోడం తప్పడంలేదు!" చికాకుపడింది.

రావులు మాట్లాడలేదు. తెచ్చిన బట్టల మూటవిప్పి వేరుచేస్తున్నాడు. అంతలో భర్త పిలవడంతో గదిలోకి వెళ్ళింది. బట్టలుపద్దు చూసేయమని చిన్నమ్మాయి లలితకి అప్పజెప్పింది. "స్కూలుకి

పైమయిపోతోందమ్మా!" అని విసుక్కున్నా బట్టలపద్దు చూడక తప్పలేదు లలితకి. బట్టలపద్దు చూసింది. అన్నీ సరిగా తెచ్చాడని నిర్ధారించుకొంది. ఆ తర్వాత ఆ నెల వుతికిన బట్టలకి ఎంత అయిందీ కూడి లెక్కకట్టింది.

"నలభైఅయిదు రూపాయల అరవై పైసలయింది నాన్నగారూ!" గదిలోకి వెళ్ళి తండ్రికి చెప్పింది.


భర్త కూతురికి డబ్బిస్తూ వుంటే అంది జానకి నెమ్మదిగా. "ఈ రావుల్ని మార్చేయాలండి! దొంగవెధవ! అన్న రోజుకి బట్టలు తేడు! శారదాంబగారి చాకలి బాగా వుతుకుతున్నాడు! వాడికి వేద్దామనుకొంటున్నా!"

భార్య మాటలకి రఘురామంకి నవ్వొచ్చింది.

"సరిసరి! వాడా నీకు దొరికాడు! మొన్న శంకర్రావుగారింటికి యేదో పని వుండి వెళ్ళా! ఆ శారదాంబ చాకలిమీద నిలువెత్తున లేచి తిట్టిపోస్తోంది. నాలుగు రోజుల్లో తెస్తానని యిరవైరోజులు చేసాట్ట! బట్టలన్నీ చిరుగులు పెట్టి తెచ్చాట్ట! పైగా వాడు బట్టల్ని అద్దెక్కూడా యిస్తూ వుంటాట్ట! వాడికన్నా మన రావులే నయం!"

భర్త మాటలు విన్న జానకికి నోట మాట రాలేదు.

"అమ్మా! రావులు బట్టలు వేయమంటున్నాడు! నేను స్కూలికిపోతున్నా"




అంటూ చాకలిపద్దు పుస్తకం టేబిలుమీద పడేసి స్కూలు పుస్తకాలు తీసుకొని తుర్రుమంది లలిత.

"రండి! భోజనం చేద్దురుగాని! తొమ్మిదిన్నర లోగా బయలుదేరాలి!" అంటూ వంటగదిలోకి దారితీసింది జానకి. అప్పటికే కూర రెడీచేసి వుంచింది పెద్దమ్మాయి ప్రసూన. చాకలికి బట్టలేసే పని ప్రసూనకి పురమాయించింది జానకి.

"స్టాండుకి వున్న బట్టలూ, మాసిన పెట్టెలో వున్న బట్టలూ అన్నీ తీసి ఏవీ మర్చిపోకుండా వెయ్యి! జాగ్రత్తగా కూడు! తర్వాత వాడివి కూడా లెక్కపెట్టమను! మీ నాన్నగారి భోజనం అయ్యేలోగా వాడ్ని పంపించెయ్!" కూతుర్ని హెచ్చరించింది.

భర్త భోజనం చేస్తూంటే మరోసారి నూరిపోసింది జానకి.

"మొన్న మా తమ్ముడు చెప్పింది జ్ఞాపకం వుందా? పిఠాపురంవారి పిల్లని పన్నెండువేలిస్తే చేసుకొంటామన్నార్ట! వారిచ్చుకోలేక ఈ సంబంధాన్ని వదలు కొన్నారు. మీరు పదివేలే యివ్వగలమని చెప్పండి. అంతకీ అంగీకరించకపోతే ఆ పన్నెండువేలూ పారేద్దాం!"

అలి మాటలు వచ్చలేదు ఆ మగ ధీరునికి. అలాగని ఆమె అభిప్రాయాన్ని మన్నించనూ లేదు; సూచలని ఖండించనూ లేదు.

"అదికాదే! మనం పదిహేనువేలు దాకా యిస్తామని మధ్యవర్తి మన్మధ రావుతో చెప్పాం కదా! ఆ విషయం వారితో అన్నానని కదా మన్మధరావు మనకి వుత్తరం రాశాడు! ఇప్పుడిలా మాట్లాడ్తే ఏం బావుంటుంది!" పీట్ను నమిలాడా మగమహారాజు.

"మా తమ్ముడీ విషయం కొంచెం ముందుగా చెప్పివుంటే బాగుణ్ణు! ఆ సంగతి తెలీక అప్పుడు అలా అన్నాం మన్మధ రావుతో!" నిరుత్సాహపడ్తూ నీరుగారింది జానకి. వెంటనే ఏదో ఆలోచన వచ్చి పోయిన వుత్సాహాన్ని పుంజుకుంది.

"ఆ మన్మధరావు వుత్తరం నిన్న సాయంత్రమే కదా అందింది! ఏదో దారి తప్పి మర్నాటికల్లా మనకా వుత్తరం అందింది. ఎప్పుడూ మూడురోజులుకదా పడ్తుంది. ఆ వుత్తరం అందనట్టుగా అతనితో మాట్లాడండి! అయినా ఆ పాటి మాట మార్చలేరటండి! 'కట్నవూ ఖర్చులూ కలిపి పదిహేను వేలువరకూ సర్దుకోగలం అని అనాడు చెప్పాను, మీరలా అర్థం చేసుకొన్నారు కాబోలు!' అని చెప్పండా మన్మధరావుతో! అంతే గానీ పెద్ద సత్యహరిశ్చంద్రునిలా నిజా యితీపరునిలా అన్నమాట ప్రకారం నిల బడక్కర్లేదు. వారికి వుద్యోగం తప్ప వేరే ఆస్తిపాస్తు ల్లేవుట!"

భర్త భోజనం ముగించి గదిలోకి వెళ్తూంటే కూడా వెళ్ళింది. చాకల్ని పంపేసి పద్దు పుస్తకంతో గదిలో ప్రవే శించింది ప్రసూన.

"అమ్మా! చెల్లి తప్పు కూడింది. చాకలికి ఇంకా ఎనిమిది రూపాయలు వెళ్తాయ్" అంది పుస్తకం తల్లికి చూపిస్తూ.

"రావులికి చెప్పావా ఈ విషయం?" తక్కున అడిగింది జానకి.

"లేదు! వాడు వెళ్ళేక ఇప్పుడే చూసా!"

"వాడు వుతికిన వుతుక్కి ఆ డబ్బు చాల్లే! ఆ పుస్తకం బీరువాలో పెట్టు!" విసుక్కొంది.

"అది కాదమ్మా! రావులు చదువు కోకపోయినా వాడి కొడుకు ఫిఫ్త్ చదువుతున్నాడు. వాడిచేత లెక్క చూపించు కొంటే బావుండదు!" భయాన్ని వ్యక్త

పరిచింది ప్రసూన.

కూతురి మాటల్ని తేలిగ్గా కొట్టిపారేసింది జానకి.

"ఆ లెక్కలు ఇంటిదగ్గర చూడరు! మనం ఎంతిస్తే అంత తీసుకుంటారు! మహా నిజాయితీపరురాలివి దొరికావుగానీ ఆ పుస్తకాన్ని జాగ్రత్త పెట్టి వంటింట్లోకి వెళ్ళు! నాన్నగారు తిన్న కంచం కడిగి ఎంగిలెత్తు! ఆయన ప్రయాణం అవుతున్నారు!"

ప్రసూన మారు మాట్లాడలేదు. ఆ జానకీపతి పెదవి కదపలేదు.

* * *

మధ్యాహ్నం ఒంటిగంట వేళ!

అప్పుడే మంచం మీద నడుం వాల్చింది జానకి.

"అమ్మగారూ!" తలుపులు చప్పుడు చేస్తూ పిలుస్తోంది పనిమనిషి గంగమ్మ. గంగమ్మ రోజూ పొద్దయవూ, సాయంత్రవూ మాత్రమే వస్తుంది. వేళకాని వేళలో ఏదో అవుసరం వుంటేనే కాని రాదు. వస్తే అయిదో పదో అప్పు అడుగుతుంది. లేదా అన్నమో కూరో కావాలంటుంది.

ప్రసూన తలుపు తీసింది. నిద్రపోక పోయినా కళ్ళు విప్పలేదు జానకి.

"అమ్మగోరూ!" గట్టిగా పిల్చింది గంగమ్మ గది గుమ్మంలో నిలబడి. విసుక్కొంటూ మంచం దిగింది జానకి. గంగమ్మ చీరచాటున చేయిపెట్టి నిలబడింది ఆ చేతిలో గిన్నె కన్పిస్తోంది.

"ఇప్పుడొచ్చావేంటే? భోజనాలయిపోయాయ్" అంది మామూలు ధోరణిలో.

"అదికాదమ్మగారూ! మొన్న సంకురాతిరినాడు స్టీలు గిన్నె పోయిందనుకున్నారు గదా! ఆ గిన్నె యియ్యేళ దొరికిందమ్మగోరూ! మా పాత సామాను పెట్టెవకాల కన్పించింది. మా పిల్లగాడు ఆడుకొని ఆ మూల పారేసాడు గావాల! సూడండమ్మగోరూ! ఇది మందే కదా! ఆ వనజమ్మగోరి కిలాంటి గిన్నెల్లేవు!"

అంటూ చేతిలో వున్న స్టీలుగిన్నె అందించింది గంగమ్మ.

సరిగ్గా రెండు నెలల క్రిందట జరిగిన సంఘటన గుర్తుకొచ్చింది జానకికి. సంక్రాంతినాడు ఆ స్టీలు గిన్నెలో పాయసం పోసి యిచ్చింది. ఆ విషయం మరిచిపోయింది. ఆ గిన్నె మిస్సయిందన్న విషయం వారంరోజుల వరకు తెలియలేదు.

"స్టీలుగిన్నె కనబడ్డంలేదు! నీకుగాని యిచ్చానా?" అని గంగమ్మని అడిగింది. తాటిచెట్టంత ఎత్తున లేచింది గంగమ్మ.

"మేమెంత పేదోళ్ళమైనా దొంగతనం మా యింటావంటా లేదమ్మగోరూ! ఇప్పటికి పదేళ్ళ నుంచీ పనులు చేసుకొస్తున్నా! ఒకమ్మా నన్నిలా అడగలేదు! ఒకరి సేత ఏలెత్తి సూపించుకోలేదు! మీకన్నా లచ్చాదికార్లిళ్ళల్లో సేసాము! మీరైతే ఈ వూరొచ్చి రెండే

ళ్ళయింది. మా నిజాయితీ తవరి కింకా పూర్తిగా తెలీదు! వూళ్ళో ఎవరినైనా అడగండి గంగమ్మ ఎలాంటిదని! ఛీ యియ్యాలెవరి మొహం చూసానో! మాట పడాల్సొచ్చింది! ఇలాంటింట్లో పని సేయడం నాదే బుద్ధి తక్కువ!"

విసవిసలాడుతూ చేస్తూన్న పని ఆపు చేసి కోపంగా వెళ్ళిపోయింది గంగమ్మ. వెళుతూ వూరంతా విన్పించేలా కేకలు వేసుకొంటూ వెళ్ళింది.

అలా వెళ్ళిన గంగమ్మ వారంరోజులైనా తిరిగి పనిలోకి రాలేదు. మరొక పనిమనిషి కుదరలేదు. పనిమనుషుల్లో పెద్ద కట్టుబాటుంది. ఒకరు తగవుపడి వదలిన యింటికి వేరొకరు పోరు! ఎలాగైతేనేం మధ్యవర్తి ద్వారా సంప్రదించి బ్రతిమాలుకొని ఆ గంగమ్మనే తిరిగి పనిలోకి తెచ్చుకొంది. ఆ విషయం తిరగదోడడానికి ధైర్యం చాల్లేదు జానకికి.

పోయిన గిన్నె దొరికినందుకు సంబరపడింది.

"పరేలే! ఎలాగైతేనేం దొరికింది! సంతోషం!" అంది ఆ గిన్నెను అటూ యిటూ తిప్పి చూస్తూ.

"అమ్మగోరూ!" అంది గంగమ్మ ఏదో అడగాలని.

"చెప్పవే! అన్నం కావాలా? కూర కావాలా?" ప్రసన్నంగా అడిగింది జానకి.

"అదికాదమ్మగోరూ! మేం సానా చిక్కుల్లో పడ్డాం!" అంది దీనంగా. దానికి డబ్బు కావాలని గ్రహించింది జానకి. ఒకనెల జీతం ఎప్పుడూ దాని మీదే వుంటుంది.

"చెప్పవే! ఏం కావాలి?" అడిగింది.

"మా ఆడబొట్టుని పురిటికి రెన్నెల్ల క్రితం తీసుకొచ్చేంగదమ్మగోరూ!..."

"అవునూ! కొడుకు పుట్టాడు కదా!" అంది.

"పోయిన వారంలో మా బంటోడికి సానా జబ్బు సేసింది కదండి! మందులికీ ఇటికీ డబ్బులేక మా ఆడబొట్టు శతమానం తాకట్టు పెట్టేడు మా మావ! ఆడికి పదో తారీకుని జీతాలందుతాయ్! అప్పుడిడిపిద్దామనుకొన్నాం! ఈ వుదయమే దాని మొగుడొచ్చాడు. ఇయ్యాళ బుధారం కదండి! ఆదారంనాడు పెళ్ళాన్ని తీసుకు పోతానంటున్నాడు. దాని శతమానం యిడిపించడానికి అర్జెంటుగా మూట యాభయ్ రూపాయిలు గావాలి! మావ జీతం అందగానే తెచ్చిచ్చేస్తా! ఈ గండం నుండి మీరే కాపాడాలి!"

బ్రతిమాలింది గంగమ్మ.

గంగమ్మ పరిస్థితిని అర్థంచేసుకొంది జానకి దాని మొగుడు ఏదో ఆఫీసులో నైటువాచరు జీతం అయిదు వందలిస్తారు.

"అయ్యగారు బెజవాడెళ్ళారు. రేపు సాయంత్రం వస్తారు. వచ్చేక చెప్పి చూస్తా!" అంది సానుభూతి ప్రకటిస్తూ!



"అమ్మగోరూ చూస్తానంటే తప్పకుండా చేస్తారు!" అంటూ అప్పుడే దొరికినంతగా సంబరపడింది గంగమ్మ.

"సాయంత్రం తొందరగా రా!" వెళ్తున్న గంగమ్మని హెచ్చరించింది జానకి.

* * *

ఆ యింటి యజమాని భజగోవిందం ఆ యింటికి వచ్చేడంటే ఒకటో తారీఖు రాత్రి ఎనిమిదిగంట లన్నమాట!

"రఘురామంగారూ!" గుమ్మంలోనే నిలబడి ఆప్యాయంగా పిల్చాడు భజగోవిందం.

"రండి బాబయ్యగారూ!" ఆదరంగా ఆహ్వానించి కుర్చీ చూపించింది జానకి.

"ఏవిటమ్మా! అల్లుడుగారు యింకా యింటికి రాలేదా?" కుర్చీలో కూర్చుంటూ అటూ యిటూ చూస్తూ అడిగాడు భజగోవిందం.

"లేదండి; ఆ మధ్య ప్రసూనని పెళ్ళివారొచ్చి చూసి వెళ్ళారు. వారితో మాట్లాడ్డానికి ఉదయమే బెజవాడ వెళ్ళారు; రేపు సాయంత్రానికి తిరిగి వస్తారు." చెప్పింది జానకి.

"కాఫీ తీసుకోండి తాతయ్యగారూ!" కాఫీ అందించింది ప్రసూన

"శీఘ్రమే కళ్యాణ ప్రాప్తిరస్తు!" దీవెన పారేసి కాఫీ అందుకొన్నాడా భజగోవిందం. కాఫీ తాగి కాళీగ్లాసు ప్రసూనకి అందిస్తూ అన్నాడు.

"నా యింట్లో దిగినవారు ఏదో ఒక శుభకార్యం చేసుకొని మరీ వెళుతున్నారు జానకమ్మా! ఆ వెళ్ళడం ఎలా అనుకుంటున్నావ్? ప్రమోషన్ మీద! మీ అమ్మాయికి త్వరలో పెళ్ళి జరగడం ఖాయం! ఆ తర్వాత అల్లుడిగారికి ప్రమోషన్ రావడం డబుల్ ఖాయం!"

"అంటే త్వరలోనే మమ్మల్ని ఈ ఊరు విడిచి వెళ్ళిపోమనా?" నవ్వుతూ అడిగింది జానకి.

"అమ్మమ్మా! ఎంతమాట! జరిగిన విషయాలు వివరిస్తున్నా తల్లీ! సరే! రేపు రాత్రి వస్తా!" అంటూ లేవబోయాడు భజగోవిందం.

"ఉండండి బాబయ్యగారూ! నిన్ననే కదా జీతాలు అందాయ్! మీ అద్దె యిచ్చేస్తా!" అంటూ కదిలింది జానకి.

"నాకు తెల్సమ్మా మీ సంగతి! మరొకరైతే ఆయనగారు ఊళ్ళో లేదు! మరోసారి రండి! అంటారు తేలిగ్గా. కాపీ రఘురామం అలాంటివాడు కాదే! అన్ని ఏర్పాట్లూ చేసి మరీ వూరికి వెళ్తారు. ఆయన సార్థకనాముడు. మీ వంటి సంస్కారవంతులూ నిజాయితీపరులూ చాలా అరుదుగా కన్పిస్తారు!" అతని పొగడ్తలకి తబ్బిబ్బయింది జానకి.

స్టీలు బీరువా తెరిచింది. భర్త ఎప్పుడూ పెట్టేచోట డబ్బు కనబడలేదు. ఆ అరంతా వెతికింది. తర్వాత అన్ని అరలూ—బీరువా అంతా వెదికింది. డబ్బు కన్పించలేదు.

"రేపు పెద్దవాడిచేత కిరాణాషాపు వాడికి మూడువందలు పంపించు. భజగోవిందం వస్తే అద్దె యిచ్చెయ్!" భర్త అన్న మాటలు చెవిలో మారుమోగుతున్నాయ్.

జానకి కంగారుని గమనించాడు భజగోవిందం.

"ఏమిటమ్మా! వెతుకుతున్నావ్?" అడిగాడు.


"బీరువాలో పెట్టిన డబ్బు కన్పించడం లేదు బాబయ్యగారూ!" జానకి స్వరం వణికింది.

"సరీగా చూడమ్మా! కంగారుపడకు! బట్టలకిందనో, పేపరు అడుగునో పెట్టారేమో?"

"లేదు బాబయ్యగారూ! ఆ వెండి గిన్నెలోనే ఎప్పుడు పెడ్తూ వుంటారు!" హీనంగా మారింది జానకి స్వరం.

మరో పదినిమిషాలు గడిచాయ్. జానకి వెతుకుతూనే వుంది. బీరువాలో వున్న సామాన్లన్నీ బయటకి తీసి చూస్తోంది.

"రేపు మళ్ళీ వస్తానమ్మా! నాకు మరో పనివుంది. కంగారుపడకుండా నిదానంగా చూడు!" అంటూ జారుకున్నాడు భజగోవిందం.




జానకికి నవనాడులూ కృంగిపోయాయ్. కుప్పలా కూలిపోయింది. తల్లి పరిస్థితి చూసి భయపడ్డారు పిల్లలు నలుగురూ. జానకిలో ఎన్నో ఆలోచనలు! వ్యూహాలు! అపోహాలు!

'ఒక నెల జీతం! అంత డబ్బు ఆయన కూడా తీసుకెళ్ళరు! పిల్లలు అలాంటివారు కాదు. తనను అడగకుండా ఒక్క రూపాయికూడా తీసుకోరు! మరి ఏమైనట్టు? పిల్లలు నిర్లక్ష్యంగా అల్మైరా తలుపులు తీసి వదిలేస్తూ వుంటారు. సాయంత్రం గది తుడుస్తున్నప్పుడు ఆ డబ్బు గంగమ్మ కంటపడి వుంటుంది. దానికి పెద్ద అవసరం వుంది. దానిని పిలిపించి అడిగితే? మరుక్షణంలోనే భయం పుట్టుకొచ్చింది జానకికి. స్టీలుగిన్నెకే పెద్ద గొడవచేసింది. ఇప్పుడు చాలా పెద్ద గొడవ అవుతుంది. ఎలా? భర్త వచ్చేక పోలీసు రిపోర్టు యిప్పించాలనుకుంది. 'వాళ్ళే కూపీలాగి నాలుగు తన్ని డబ్బు గుంజుతారు.' అనుకుంది, ఆ రాత్రంతా ఏడుస్తూ గడిపింది జానకి.

మర్నాడుదయం గంగమ్మ పనిలోకి వచ్చింది. పనులుచేసుకొంటోంది. దానిని గమనిస్తూనే వుంది జానకి. గంగమ్మలో ఏ విధమైన మార్పూ కన్పించలేదు. ఆరితేరిన దొంగలు ఆలాగే తొణక్కుండా, బెణక్కుండా వుంటారనుకొంది.

"నే ఎల్తున్నానమ్మగోరూ!" పని ముగించి గుమ్మం దిగుతూన్న గంగమ్మని చూస్తూ అనుకొంది.

'పెద్ద నిజాయితీపరురాల్లా దాచేసుకొన్న స్టీలుగిన్నె తెచ్చి యిచ్చింది! ఇప్పుడు పనిమానేస్తే అనుమానపడతామని పనిలోకి వచ్చింది. దీని అంతు చూస్తా!' కసిగా అనుకొంది.

పది గంటల వేళప్పుడు వచ్చేడు చాకలి రావులు.

"అమ్మగారూ?" గుమ్మంలోంచే కేకే పాడు గట్టిగా.

'డబ్బు తప్పు లెక్కకట్టి తక్కువ యిచ్చామని తెలుసుకున్నాడేమో! ఇంటి దగ్గర కొడుకుచేత లెక్కరాయిస్తాడు కాబోలు! తప్పుడు లెక్కలు కట్టి డబ్బు తక్కువ యిస్తున్నట్లు చుట్టుపక్క వాళ్ళకి తెలిస్తే బావుండదు! వాడితో గొడవెందుకు అమ్మాయి సరీగ్గా కూడలేదు కాబోలు అని చెప్పి ఆ మిగతా సొమ్ము పారేస్తే పోతుంది!' అనుకొంది జానకి.

"రావులొచ్చాడు! ఆ చాకలిపద్దు పుస్తకం పట్రా" పెద్దకూతుర్ని పిలిచింది ప్రసూన పెరట్లో వుంది.

"విన్నానే నా డబ్బులిచ్చేసే రమ్మ గోరూ!" అని రావులనడంతో "అహా! అలాగా?" అంది పరాగ్గా! మిగతా డబ్బు ఇవ్వనవసరం లేనందుకు సంతసించింది

"అమ్మగోరూ! ఇంత పరాకైతే ఎలాగండి! ఈపొద్దు రేవులో అయ్యగారి బట్టలు తడుపుతూంటే పాంటు జేబులో సొమ్ము కనిపించింది! చేతులొణికాయ్! అరి జెంటుగా లగెత్తుకొచ్చా! సరీగున్నాయో లేదో లెక్క సూసుకొండమ్మా! అన్నీ వంద రూాయలనోట్లే! పదహారొండ లున్నాయ్!"

నోట్ల కట్టను అందించాడు రావులు.

జానకి కళ్ళు ఆనందంతో మెరిసాయ్! డబ్బందుకొని కళ్ళకద్దుకొంది. వాడి నిజాయితీకి అచ్చెరువొందింది.

"చాలా సంతోషం రావులూ! డబ్బు పోయిందనుకొన్నా! రాత్రి తెల్లవార్లూ నిద్రపట్టలేదు!" కృతజ్ఞత తెలిపింది జానకి.

"నే వత్తానమ్మగోరూ!" అంటూ గుమ్మం దిగాడు రావులు.

పద్దులపుస్తకం చేతపట్టుకొని వచ్చింది ప్రసూన.

"అమ్మా! యిదిగో చాకలిపద్దు పుస్తకం!" అంది. వెళ్తూన్న రాములు వైపే చూస్తూన్న తల్లిని మళ్ళీ అడిగింది కూతురు.

"రావులు వెళ్ళిపోతున్నాడు! పిలవమంటావా?"

"ఎందుకూ పిలవడం? వాడందుకు రాలేదులే!" అంటూ తల్లి గదిలోకి వెళ్తూంటే వెనకనే వెళ్ళింది ప్రసూన, రావుడెందుకొచ్చాడో తెల్సుకోడానికి.